క్లుప్తంగా

అడ్డుకొండలో భూసర్వే నిర్వహించాలి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: మేఘవరం పంచాయతీ పరిధి అడ్డుకొండలో భూ సర్వే నిర్వహించి భూ ఆక్రమణలు లేకుండా గిరిజనులకు హక్కు కల్పించాలని రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మేఘవరం సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. గిరిజన రైతులకు కౌలు రైతు కార్డులు అందజేసి రుణాలు మంజూరు చేయాలని, గిరిజన గ్రామాలకు విద్యా, వైద్య, మౌళిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బి.వాసుదేవరావు, బి.అప్పారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిఘటన ర్యాలీ

టెక్కలి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం టెక్కలిలో ప్రతిఘటన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోకర నారాయణరావు, చల్లా రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో ఎస్సీ ,ఎస్టీ సామాజిక వర్గం ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మపురంలో పారిశుద్ధ్య పనులు



ధర్మపురం వీధుల్లో బ్లీచింగ్ జల్లుతున్న కార్మికురాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ధర్మపురం గ్రామ పంచాయతీలో కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్తగా కాలువల్లో పూడిక తీయడంతో పాటు దోమలు విజృంభించకుండా వీధుల్లో దోమల మందు ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంతబొమ్మాళి: విద్యార్థులు కంటి పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పరిమిళ అన్నారు. జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా నివారణ సంస్థ సౌజన్యంతో అకాశలక్కవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాసు సుమారు 160 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో ఐదుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. కంటి ఆరోగ్యం-సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు కనకరాజు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో ఈక్రాప్ నమోదు



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యం

పలాస: రైతులు పండించిన పంటలను ఈక్రాప్ కింద సకాలంలో నమోదు చేయాలని తహసీల్దార్ సత్యం అన్నారు. వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటలను నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పోలారావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సాయి హర్షిత

కంచిలి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మఠం సరియాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బి.సాయి హర్షిత అన్నారు. పెద్దకొజ్జిరియా గ్రామంలో మంగళవారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 30 మందికి జ్వర పరీక్షలు చేశారు. ఇద్దరికి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారు. శిబిరాన్ని ఎంపీడీవో వి.నీరజ పరిశీలించారు.

అన్నదాత ఆందోళన!



ఇచ్ఛాపురం రూరల్: భీమ సముద్రం గెడ్డలోకి చేరిన వరద నీరు



ఇన్నేశుపేట కాజ్‌వే వంతెనపై పారుతున్న ధర్మపురం గెడ్డ వరద



ఇచ్ఛాపురం రూరల్: బలరాంపురం పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భార్గవి



సోంపేట: ముంపునకు గురైన పలాసపురం వరి పొలాలు

- 513 ఎకరాలు వర్షార్పణం
- ఉప్పొంగుతున్న గెడ్డలు, వాగులు
- ఇన్నేశుపేటలోకి వరద నీరు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో గెడ్డలు, వాగులు ఉప్పొంగాయి. బహుదానదిలోకి ఏడు వేల క్యూసెక్కులు వరద వచ్చి చేరిందని ఇరిగేషన్ ఏఈ మధుసూదన పాణిగ్రాహి తెలిపారు. మండపల్లి భీమ సముద్రం గెడ్డ, ఇన్నేశుపేట ధర్మపురం గెడ్డల్లో ఉద్ధృతంగా వరద నీరు పారుతుండటంతో తులసిగాం పంచాయతీ పరిధిలో 320 ఎకరాలు, మండపల్లి పరిధిలో 56 ఎకరాలు, రత్తకన్న ప్రాంతంలో 60 ఎకరాలు, ధర్మపురం ప్రాంతంలో 48 ఎకరాలు, కొఠారీ ప్రాంతంలో 29 ఎకరాలు మొత్తం 513 ఎకరాల పంట భూములు వరద ముంపుకు గురైనట్లు తమ సిబ్బంది అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి టి.భార్గవి తెలిపారు. ధర్మపురం గెడ్డలో భారీగా నీరు చేరడంతో వరద నీరు గ్రామంలోకి చొచ్చుకుపోవడంతో పంట పొలాలకు వెళ్లే కాజ్‌వే పూర్తిగా మునిగిపోయింది. దీంతో మంగళవారం తహసీల్దార్ ఎన్.వెంకటరావు ముంపునకు గురైన పంట భూములను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయాధికారి భార్గవికి సూచించారు.

ముంపులో బీల పొలాలు

సోంపేట: మండలంలోని బీల ప్రాంత గ్రామాలైన పలాసపురం, బెంకిలి, రుషికుద్ద, ఇస్కలపాలెం, గొల్లగండి, బారువ గ్రామపంచాయతీల పరిధిలోని బీల ప్రాంతంలో సుమారు 250 ఎకరాల వరి పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి చేను దుబ్బుకట్టే దశలో ఉందని, నీరు ఎక్కువ నిల్వ ఉండడంతో చేను ఎదుగదలపై ప్రభావం చూపి దిగుబడులు తగ్గే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి బీల ప్రాంత రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పొలాల పరిశీలన

రుషికుద్దలో ముంపునకు గురైన వరి పొలాలను వ్యవసాయధికారి బి.నర్సింహమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఢిల్లీరావు, కవి మంగళవారం పరిశీలించారు. బీల ప్రాంతంలో వరి పొలాల్లో నీరు నిల్వ ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో నీరు తగ్గితే పంటకు ఎటువంటి నష్టం వాటిల్లదని వ్యవసాయాధికారి తెలిపారు. ముంపు తగ్గిన తరువాత బూస్టర్ డోస్‌గా 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎకరానికి వేసుకోవాలని పేర్కొన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

పుక్కళ్లపాలెం, ఇద్దివానిపాలెంలో పొగురు తీత పనులు

కవిటి: మండలంలో ఇటీవల కురిసిన భా రీవర్షాలకు వరద ముంపులో ఉన్న పంటపొలాల్ని రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమైంది. పుక్కళ్లపాలెం వద్ద రంగాలగెడ్డ నుంచి వరదనీరు మళ్లింపు, ఇద్దివానిపాలెం గొనామరిగెడ్డ నుంచి వరదనీటిని మళ్లించే ప్రక్రియ మంగళవారం అధికారులు ప్రారంభించారు. పుక్కళ్లపాలెం వద్ద ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ జేసీబీ సాయంతో పొగురు (వరదనీటిని సముద్రంలోకి మళ్లింపు) పనుల్ని ప్రారంభించారు. ఇద్దివానిపాలెం వద్ద పనుల్ని తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. బుధవారం ఉదయానికి పనులు పూర్తి అయి వరద నీరు సముద్రంలో కలిసే వీలుందని రైతులు అంచనా వేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా వరదనీటి మళ్లింపేలక్ష్యంగా పనులు చేపట్టాలని అధికారుల్ని ఎమ్మెల్యే అశోక్ ఆదేశించారు.

నీటి మళ్లింపునకు చర్యలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో మెయిన్‌రోడ్డు పక్కన గల ఎస్సీ కాలనీలోనికి వరదనీరు చేరుతుండటంతో అక్కడ నివాసం ఉంటున్న వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు ఇక్కడి వారు బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. రెండు రోజులుగా కురిసిన వర్షానికి కూడా ఇక్కడ ఇళ్లలోకి వరదనీరు చొరబడింది. దీంతో అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక పంచాయతీ యంత్రాంగం జేసీబీ సాయంతో ఇళ్లలోకి వరదనీరు వెళ్లకుండా మళ్లించేందుకు డ్రైన్‌ను తవ్వారు.



సోంపేట: ముంపునకు గురైన బెంకిలి వరి పొలాలు



సోంపేట: ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బీలబట్టి



సోంపేట: రుషికుద్దలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు



కవిటి:పుక్కళపాలెం వద్ద జేసీబీతో పొగురుపనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బి అశోక్



ఇచ్ఛాపురం రూరల్: పంట పొలాలు మదుము వద్ద చేపలు పడుతున్న తులసిగాం రైతులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావును మంగళవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈయన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఇటీవల అవార్డును అందుకున్నారు. అలాగే వివిధ పోటీల్లో ఆయన నేతృత్వంలో గెలిపొందిన విద్యార్థులను కూడా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, వైద్య ఆరోగ్య శాఖ హెచ్ఐవీ, ఎయిడ్స్, డ్రగ్స్ అబ్యూస్ అనే అంశంపై జిల్లా కేంద్రంలో గత నెల తొమ్మిదో తేదీన జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పదో తరగతి విద్యార్థి బి.హేమంత్ ద్వితీయ స్థానం పొంది రూ.5 వేలు నగదు బహుమతిని అందుకున్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో అక్కుపల్లిలో జరిగిన ప్రాచీన జానపద కళారూపాలు అనే అంశంపై ఎస్.ప్రణతి ప్రథమ స్థానం పొంది బహుమతిని గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో వీరందరిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణరావు, ఈశ్వరరావు, మధుబాబు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలపై వేధింపులు మానుకోవాలి



కె.కొత్తూరు పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

టెక్కలి/ టెక్కలి రూరల్: ఆశ కార్యకర్తలపై వేధింపులు విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కె.కొత్తూరు పీహెచ్‌సీ వద్ద మండలంలోని ఆశ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఉన్నత స్థాయి సిబ్బంది వేధింపులు తాళలేక టెక్కలి గ్రామ సచివాలయం -3 ఆశ కార్యకర్త సరస్వతి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన నేపథ్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో కీలకంగా ఆరోగ్య సేవలు అందజేస్తున్న ఆశ కార్యకర్తలపై ఉన్నత స్థాయి సిబ్బంది తారస్థాయిలో మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఆశ కార్యకర్త సరస్వతి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు హెచ్.ఈశ్వరరావుతో పాటు మండలంలోని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల నిరసన



కంచిలి: నల్లబ్యాడ్జితో విధులు నిర్వహిస్తున్న మఠం సరియాపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సాయి హర్షిత

కంచిలి: వైద్యుల సర్వీస్ కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి కుదించడంపై ప్రాథమిక వైద్య కేంద్రాల వైద్యులు సమ్మె ప్రారంభించారు. మొదటి రోజైన మంగళవారం నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వర్తిస్తూ నిరసన తెలియజేశారు. ఈ నెల 13వ తేదీన అత్యవసర సేవలు మినహా మిగిలిన విధులకు గైర్హాజరవుతామని, ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే 16వ తేదీ నుంచి నిరాహార దీక్షలను చేపడతామని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ వైద్య సంఘం నాయకులు తీసుకున్న ఈ నిర్ణయం మేరకు మఠం సరియాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సాయి హర్షిత మంగళవారం నల్ల బ్యాడ్జితో విధులకు హాజరయ్యారు.

తెలుగు సాహితీ శిఖరం సత్యన్నారాయణ



సత్యన్నారాయణకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి: తెలుగు సాహిత్యంలో శిఖర సమానులుగా విశ్వనాథ సత్యన్నారాయన నిలిచారని కవిటి ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వరరావు అన్నారు. సత్యన్నారాయణ జయంతి కార్యక్రమాన్ని పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలపై మాట్లాడారు. మొట్టమొదటి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న సాహితీవేత్తగా నిలిచారన్నారు. విశ్వనాథ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు జానకీరావు, కృష్ణారావు, వాసుదేవరావు, గిరిబాబు, అరుణకుమారి, రాధిక, జ్యోతికుమారి, శ్రీరాములు నాయుడు, నాగరాజు, లచ్చయ్య, పద్మిని సోమేశ్వరరావు ఉన్నారు.

పంట పెట్టుబడి సాయం అందించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘ జిల్లా నాయకులు టి.భాస్కరరావు, బమ్మిడి ఆనందరావు, కొనారి బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంపల్లి, బెండి, వజ్రపుకొత్తూరుని గ్రామ సచివాలయ వద్ద మంగళవారం అందోళన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని, గత ఏడాది దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని, పంటల బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ ఉద్యోగులకు అందించారు. కాగా రైతులు పడుతున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో ఎన్.మోహన్, బి.సుగుణ, ఎస్.జోగారావు, బి.రామకృష్ణ ఉన్నారు.

కాశీబుగ్గ: ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతులకు అందించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరుతూ రైతు సంఘాల నాయకులు నిరసన తెలియజేశారు. కాశీబుగ్గ సంత మైదానంలోని సచివాలయం అధికారులకు రైతు సంఘాల నాయకులు టి.అజయకుమార్, ఎం.రామారావు వినతిపత్రం సమర్పించారు.

మొక్కలను పరిరక్షించాలి



మొక్కలను నాటుతున్న అధికారులు

పలాస: మొక్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలని ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద వనమహోత్సవంలో భాగంగా మంగళవారం మొక్కలను నాటారు. పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, ఏఈ పార్వతి, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు ఉన్నారు.


చింతామణి అమ్మవారికి బంగారం వితరణ



బంగారు కానుకను అందిస్తున్న హేమారావు

కవిటి: కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి భక్తులు బంగారు ఆభరణాలు కానుకగా సమర్పించారు. ఈ మేరకు గ్రామస్తుల సమక్షంలో కవిటికి చెందిన ప్రవాస భారతీయ ఉద్యోగి జక్కం హేమారావు రూ. 90 వేల విలువైన బంగారు ఆభరణాల్ని తయారు చేయించి కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. దాతల ఔదార్యాన్ని గ్రామస్తులు కొనియాడారు.

లెనిన్‌కుమార్‌కు డీఎస్సీ అవార్డు



లెనిన్‌కుమార్

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన న్యాయవాది బొంపల్లి విశ్వనాథం, వామాక్షిల కుమారుడు లెనిన్ కుమార్‌కు అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా డాక్టరేట్ (డీఎస్సీ) అవార్డుతో మంగళవారం సత్కరించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపారు. యూసీఏ ప్రెసిడెంట్ డాక్టర్ శాంటినర డి.సాల్లో అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ రీసెర్చ్ రంగంలో లెనిన్ కుమార్ చేసిన కృషిని గుర్తించారన్నారు. ఒక దశాబ్దపు పరిశోధన రచనలకు డాక్టరేట్‌ను అందుకున్నారన్నారు.

ఐలమ్మకు ఘననివాళి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజకసంఘ ప్రతినిధులు

సోంపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషిచేద్దామని రజక సంఘం ప్రతినిధులు అన్నారు. సోంపేటలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి ధర్మారావు, ప్రతినిధులు నిమ్మాడ సత్యం, రంజిత్, దేవేంద్ర ఉన్నారు.

వరద బాధితులను .. ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- ప్రజలను అప్రమత్తం చేయకపోవడం దారుణం
- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



పిరియా విజయ

కంచిలి: విజయవాడ వరద బాధితుల పరిస్థితి దారుణంగా ఉందని, వారిని ఆదుకొని, సహాయ చర్యలు చేపట్టే విషయంలో రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. ఈ విషయమై 'సాక్షి'తో ఆమె మంగళవారం మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణశాఖ, నీటి పారుదల విభాగం ముందస్తు హెచ్చరికలను ప్రభుత్వానికి తెలియజేస్తుందని, అప్పుడు ప్రభుత్వం వెంటనే ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారిని రక్షిత ప్రదేశాలకు తరలించడం, వారి బాగోగులు చూడటం వంటివి చేయాల్సి ఉందన్నారు. కానీ భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కనీసం గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న వారిని కూడా ఖాళీ చేయించే ప్రయత్నం చేయలేదని చెప్పారు. కేవలం చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారని ఆరోపించారు. దీనివల్లనే ఇంత ఘోరమైన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు ముంచెత్తిన తర్వాత ప్రజలు తమకు తాముగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నం చేశారని, ఈ క్రమంలో 50 మంది మరణించారన్నారు. ఎత్తైన ప్రదేశాలకు చేరుకొని ప్రాణాలు రక్షించుకున్న కుటుంబాలకు కనీసం నీరు, ఆహారం, పిల్లలకు పాలను బోట్లు, పడవలు ద్వారా చేరవేసే ప్రయత్నం జరగలేదన్నారు. కేవలం నీళ్లులేని ప్రాంతాల్లో మాత్రమే అరకొరగా అందజేశారని చెప్పారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా కనీసం వసతులకు నోచుకోని పరిస్థితి ఇక్కడ దాపురించడం దారుణమన్నారు. అధికార యంత్రాంగం కష్టాల్లో ఉన్న ప్రజల్ని పట్టించుకోకుండా కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట తిరగడ తప్ప మరేం చేయలేదని అన్నారు. కేవలం ప్రెస్ మీట్లు వలన ప్రజలకు సాయం అందించినట్లు భ్రమ కల్పించడం సరికాదని, వాస్తవంగా వారికి అవసరమైన సాయం చేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

వరకట్న వేధింపుల కేసు నమోదు

కాశీబుగ్గ: తనను అత్తింటివారు వేధిస్తున్నారని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డు పద్మనాభపురం గ్రామం శివాజీనగర్కు చెందిన పరసాన తులసిని ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు మంగళవారం తెలిపారు. భర్త శ్రీనివాస్, మరిది లక్ష్మీకుమార్ (తోటపాలెం)లు అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధించడంతో పాటు చంపుతామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కాశీబుగ్గ సీఐ దాడి మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 20 వేల ఆర్థికసాయం

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టిపురం గ్రామానికి చెందిన లక్కోజు వెంకట్రావు క్యాన్సర్‌తో ఇటీవల మృతి చెందారు. ఇతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అండగా నిలిచారు. రూ. 20 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని వెంకట్రావు కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి చిన్నాచారి, కార్యవర్గ సభ్యులు వజ్రాల విష్ణు మాస్టార్, కొండపల్లి అర్జున్‌రావు ఉన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

ఇచ్ఛాపురం: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జేసీఐ (జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా) స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షణ్ముఖరావు అన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కేజీబీవీలో దంత సంరక్షణపై విద్యార్థినులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్.రూప, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ, కేజీబీవీ ఎస్‌వో శిరీష, జేసీఐ ప్రతినిధులు ఢిల్లేశ్వరరావు, స్వరూప్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వరదనీరు మళ్లింపు

టెక్కలి: ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక మండాపొలం కాలనీలోని పలు వీధుల్లో వరద నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులే స్వచ్ఛందంగా నీటిని మంగళవారం మళ్లించుకున్నారు. వరద నీటిని మళ్లించాలని పంచాయతీ అధికారులకు విన్నవించారు. అయితే వారి నుంచి స్పందన లేకపోవడంతో కాలనీ వాసులు చందాలు వేసుకుని జేసీబీతో మురుగు నీటిని మళ్లించుకున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలని వినతి

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానిక చేరుకునే వరహాల గెడ్డ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నూతన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బ్రాహ్మణతర్లా గ్రామస్తులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను తన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆళ్ల వెంకట్రాం, వడ్డీ యాదగిరి, ఆర్.సుధాకర్, ఆళ్ల కృష్ణారావు, బమ్మిడి ఆనందరావు, తుంగాన సింహాచలం, బెండి రమేష్, నీలాచలబ్రహ్మ, కొవ్వూరు ఢిల్లీ ఉన్నారు.

17న పలాస మండల సమావేశం

కాశీబుగ్గ: పలాస మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీటీవో రమేష్‌నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు ఉంగ సాయిప్రవీణ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు సచివాలయం పరిధికి చెందిన కర్రి సరస్వతమ్మ(47) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు మంగళవారం తెలిపారు. ఆరోగ్య పరిస్థితి సరిగ్గాలేని ఆమె వారం రోజులుగా ఇంటికి చేరలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే జీతం

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితుల కోసం తన ఆగస్టు నెల వేతనాన్ని విరాళంగా అందజేస్తున్నట్టు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం తెలిపారు.

కంకర తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

కాశీబుగ్గ: పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ అనుమతి లేకుండా కంకర తవ్వకాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

హెచ్ఐవీపై అవగాహన

కాశీబుగ్గ: హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని అధికారులు అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సూచనలు అనుసరించి వైసీబీ పీయూ ట్రాకర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఒకటోవార్డు పరిధి మొగిలిపాడు జంక్షన్ వద్ద ఉన్న చందన జీడి పరిశ్రమలో మీకు తెలుసా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు, కార్మికులు పాల్గొన్నారు.